మిథిలానగర్ మళ్లీ మునిగింది..!

- రెండు దశాబ్దాలుగా ఇదే దుస్థితి
- ఎస్‌ఎన్‌డీపీ నాలా నిర్మించినా మారని పరిస్థితి
- చినుకు పడితే భయం భయం


కాలనీ రోడ్లపై వరద ప్రవాహం


ఆర్‌సీఐ రహదారిపై నిలిచిన వరద నీటిని తొలగించడానికి మ్యాన్‌హోల్‌ను తెరుస్తున్న మునిసిపల్ సిబ్బంది


మిథిలానగర్‌లో ఓ ఇంట్లోకి చేరిన వరదనీరు


సరూర్‌నగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మిథిలానగర్ కాలనీని వరద ముంపు వదలడం లేదు. దాదాపు రెండు దశాబ్దాలుగా ఇక్కడ ఇదే దుస్థితి కొనసాగుతున్నా అధికార యంత్రాంగం శాశ్వత నివారణ చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. దాంతో చినుకు పడితే చాలు ఇక్కడి నివాసితులు భయం భయంగా గడుపుతున్నారు. కాలనీకి ఎగువన గల మంత్రాలచెరువుతో పాటు ఎగువ ప్రాంతంలోని కాలనీల నుంచి వచ్చే వరద నీరు మిథిలానగర్‌ను ముంచెత్తుతోంది. కాలనీలోని అన్ని రోడ్లూ వరద నీటిలో చిక్కుకుపోతున్నాయి. అనేక నివాస గృహాల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దాంతో ఇళ్లలోని నిత్యావసరాలు, ఇతర సామగ్రి నీటిలో తడిసి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయని బాధితులు వాపోతున్నారు.

పాలకులు మారినా మారని దుస్థితి..

మిథిలానగర్ కాలనీ.. జిల్లెలగూడ గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ఏర్పడిన కాలనీల్లోని మొదటిది. ఈ కాలనీ ఏర్పడి రెండు దశాబ్దాలకు పైనే అవుతోంది. నాటి నుంచి నేటి వరకు ఈ కాలనీ వరద గుప్పిట్లోనే కొనసాగుతుండడం గమనార్హం! 2002లో కురిసిన వానలకు ఈ కాలనీ జలమయం కాగా నాటి పంచాయతీ పాలక వర్గం ప్రతినిధులు కాలనీ రోడ్ల పక్కన చిన్న చిన్న కాలువలు తవ్వి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. అనంతరం 2008 వరకు వానలు లేకపోవడంతో కాలనీలో ఇళ్ల నిర్మాణం పెరిగింది. అయితే 2008 ఆగస్టులో కురిసిన భారీ వర్షాలు కాలనీని మరోసారి వరద నీటితో ముంచేశాయి. దాని పక్కనే ఉన్న సత్యసాయినగర్‌కాలనీ సైతం నీట మునిగింది. మీర్‌పేట్‌లోని మంత్రాలచెరువు అలుగు నుంచి వచ్చే నీటి వల్లనే తమ కాలనీ మునిగిందని పేర్కొంటూ మిథిలానగర్, సత్యసాయినగర్‌వాసులు అప్పట్లో చెరువు వద్ద ధర్నా సైతం నిర్వహించారు. మరోపక్క చెరువు దిగువన ఎప్పటికైనా వరద ముప్పు ఉంటుందని తెలిసి కూడా కొందరు వ్యాపారులు వెంచర్ చేసి అమాయకులకు అంటగట్టారని స్థానికులు ఆరోపించారు. ప్రస్తు తం కాలనీ మొత్తం ఇళ్లతో నిండిపోగా.. వర్షం కురిసినప్పుడు స్థానికులు నరకం చూస్తున్నారు. చినుకు పడితే చాలు వారికి కునుకు ఉండడం లేదు.

నాలాలు నిర్మించినా ప్రయోజనం శూన్యం

అప్పట్లో ఎమ్మెల్యే సబితారెడ్డి హోంమంత్రిగా ఉన్నప్పుడు మీర్‌పేట్ పెద్దచెరువు నుంచి మంత్రాలచెరువు మీదుగా జిల్లెలగూడ చెరువు వరకు ప్రత్యేకంగా వరద నీటి కాలువ నిర్మింపజేశారు. దీని వల్ల కొన్నాళ్లు ఉపశమనం లభించినప్పటికీ అనంతరం పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. సదరు కాలువ సామర్థ్యం సరిపోకపోవడంతో వరద నీరు రోడ్లపైకి ప్రవహిస్తోంది. ఐదేళ్ల క్రితం ఇక్కడ ఎస్‌ఎన్‌డీపీ నాలా నిర్మాణం పనులు చేపట్టినప్పటికీ అది కూడా ఇక్కడ నిరుపయోగంగానే మారింది. కాలనీలోని రోడ్లకు, నాలాకు లెవెల్ కలువకపోవడంతో వరద నీరు వెనక్కి వచ్చి కాలనీని ముంచేస్తోంది. దీనికి శాశ్వత పరిష్కారం కనుక్కుంటామంటూ పాలకులు చేసే ప్రకటనలు అమలుకు నోచుకోవడం లేదు. దాంతో వర్షం కురిసిన ప్రతిసారీ మిథిలానగర్ నీట మునుగుతోంది. తాజాగా గత వారం రోజులుగా కురుస్తున్న వానలకు సైతం కాలనీ జలమయమయింది. నేటికీ కాలనీ రోడ్లపై వరద నీరు అలాగే పారుతోంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తమ కాలనీకి వరద ముప్పు తప్పేలా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


ఎగువ ప్రాంతాల నుంచి మిథిలానగర్ కాలనీలోకి ప్రవహిస్తున్న వర్షం నీరు


ప్రియదర్శినికాలనీలోని ఇండిపెండెంట్ ఇండ్లు, అపార్టుమెంటు వాసులతో సమావేశమై మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి

కలిసి ఉంటేనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ప్రియదర్శిని కాలనీలోని ఇండిపెండెంట్ ఇండ్లు, అపార్టుమెంటు వాసులకు మ ధ్య నెలకొన్న పంచాయతీని పరిష్కరించేందుకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డితో కలిసి ఆదివారం ప్రియదర్శిని కాలనీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల వారితో సమావేశమయ్యారు. పంచాయతీకి గల కారణాలను ఇరువురిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒకే కాలనీలో ఇండిపెండెంట్ ఇండ్లు, అపార్టుమెంటువాసుల మని రెండుగా విడిపోవడం సరికాదని హితవు పలికారు. విడిపోవడం వల్ల కాలనీ అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతుందన్నారు. కలిసి ఉంటేనే అభివృద్ధి వేగంగా జరుగుతుందని తెలిపారు. ఇరువర్గాల వారు కలిసి వచ్చి అభివృద్ధి పనులను మంజూరు చేయించుకోవాలని కోరారు. అన్ని కాలనీల్లో అపార్టుమెంట్లు, ప్రత్యేక ఇండ్లు ఉంటాయని గుర్తుచేశారు. వివాదాల జోలికి వెళ్లకుండా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు మల్లీశ్వరీరెడ్డి, జక్కిడి రఘువీర్‌రెడ్డి, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.


కాలనీవాసుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వర్షాలకు కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలి

వనస్థలిపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వరుసగా కురుస్తున్న వర్షాలకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి డివిజన్‌లోని శివారు కాలనీల్లో వరద నీరు రోడ్లపైకి, ఇళ్లల్లోకి వచ్చాయని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. ఈ మేరకు ఆదివారం కార్పొరేటర్ హైడ్రా సిబ్బందితో కలిసి మహాలక్ష్మీకాలనీలో వర్షపునీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుసగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావాలని లేనిచో ఇంటికే పరిమితం కావాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హైడ్రా సూపర్‌వైజర్ సతీష్, కాలనీ అధ్యక్షుడు బొడిగే యాదయ్యగౌడ్, రాజు, హరి పాల్గొన్నారు.


మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండండి

హయత్‌నగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని రంగనాయకుల గుట్ట కాలనీ వరద నీటి కాలువల్లో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని మ్యాన్‌హోల్స్ తెరిపించి క్లీన్ చేయించారు. స్థానిక ఏఈ హేమానాయక్‌తో కలిసి ఆయన లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి పొంగుతున్న మ్యాన్‌హోల్‌లను తెరిపించారు. మరికొన్ని రోజుల పాటు భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రంగ నాయకుల గుట్ట, బంజారాకాలనీ, లక్ష్మీప్రియనగర్, తిరుమలకాలనీ, ఆర్టీసీ మజ్దూర్ యూనియన్‌కాలనీ, మైసమ్మకాలనీ, ఎలాంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే తనకు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, మొగుటయ్య పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలను ఆదుకోవడమే లక్ష్యం : ఉప్పల

మన్సూరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డలను ఆదుకుని వారికి అండగా నిలవడమే ఉప్పల ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ వ్యవస్థాపకులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఈటూరు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన వెంకట్‌రామ్‌రెడ్డి, లక్ష్మి దంపతుల కుమార్తె మధులతకు వివాహం నిశ్చయమైంది. విషయం తెలుసుకున్న శ్రీనివాస్‌గుప్తా ఆదివారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన సతీమణి ఉప్పల స్వప్నతో కలిసి మధులతకు పుస్తెమెట్టెలు, చీరగాజులు అందజేశారు. కార్యక్రమంలో మధులత తల్లిదండ్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దామోదర్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తా : ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి


ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సేవ సభ్యులు

మన్సూరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ సిం దూర్ ఎన్‌క్లేవ్ హైరైజ్ అపార్ట్‌మెంట్స్ వద్ద తన సొంత ఖర్చుతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి హామీ ఇచ్చారు. సిందూర్ ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్(సేవ) సభ్యులు సిందూర్ ఎన్‌క్లేవ్‌లో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్సీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఫండ్ ద్వారా తన ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించండని సేవ అధ్యక్షుడు అనంతరాములు కోరారు. ఇందుకు ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందిస్తూ ఎమ్మెల్సీ ఫండ్ ద్వారా కాకుండా తన సొంత ఖర్చుతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తానన్నారు. ఇందుకు సేవ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో సేవ ప్రధాన కార్యదర్శి విజయసారథి, ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి కేఎంరెడ్డి, సభ్యులు కె.పరమేశ్వర్, సతీష్‌రెడ్డి ఉన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

వనస్థలిపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వనస్థలిపురంలోని జనప్రియ హోమ్స్ కాలనీలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.బి చారి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సమస్యలు పరిష్కరించకపోవడంతోనే ఉద్యోగులు, పెన్షనర్లు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.సుదర్శన్‌రెడ్డి, కృష్ణారావు, బి.జె.ఎంరెడ్డి, భగవంత్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

భారీ వర్షానికి కూలిన ఇల్లు, మరో ఇంటి ప్రహరీ

- సందర్శించిన మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల

చాదర్‌ఘాట్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల దాటికి ఆజంపుర డివిజన్‌లోని ఫర్హత్‌నగర్‌లో నాలా పక్కనున్న రేకుల ఇల్లు కూలింది. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం అనంతరం ఫర్హత్‌నగర్‌లోని నాలా పక్కన రేకుల ఇల్లు ఒక్కమారుగా కూలిపోవడంతో అందులో నివాసముంటున్న బషీర్ కుటుంబీకులు భయంతో బయటికి పరుగులు తీశారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అదేవిధంగా ఫర్హత్‌నగర్‌లో నాలా పక్కనున్న మరో ఇంటి ప్రహరీ గోడ కూలిపోయింది. ఈ ఘటనలో కూడా ఎవరికి గాయాలు కాలేదు. ప్రస్తుతం ఆ ఇంటిని గోడౌన్‌గా ఉపయోగిస్తున్నారు. కూలిన ప్రహరీతో పక్కనున్న ఫర్హత్‌నగర్ నాలా నుంచి వేగంగా ప్రవహిస్తున్న వరద నీటితో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆదివారం సందర్శించారు. ఫర్హత్‌నగర్ నాలా పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ఆయన జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.


ఫర్హత్‌నగర్‌లో కూలిన రేకుల ఇల్లు

శిథిలావస్థకు చేరిన పాత మీర్‌చౌక్ ఏసీపీ కార్యాలయ భవనం

డబీర్‌పురలోని పాత మీర్‌చౌక్ ఏసీపీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరిందని, ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదముందని స్థానికులు ఎమ్మెల్యే బలాలకు విన్నవించారు. ఈమేరకు ఆయన ఆదివారం పాత మీర్‌చౌక్ ఏసీపీ కార్యాలయ భవనాన్ని సందర్శించి వీలైనంత త్వరగా శిథిలావస్థకు చేరిన ఈ భవనాన్ని కూల్చివేసేందుకు చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.

గిరిజన హక్కుల కోసం పోరాటం చేద్దాం

- తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్


అంబేద్కర్‌నగర్‌లో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్, గోపీనాయక్ తదితరులు

ఎల్బీనగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కుల కోసం పోరాటం చేద్దామని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్ పిలుపునిచ్చారు. ఆదివాసి హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేడ్కర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలు గడిచినా అంబేడ్కర్‌నగర్ వాసులకు ఇండ్ల పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బస్తీవాసులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారన్నారు. బస్తీవాసులకు తక్షణమే ఇండ్ల పట్టాలు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఐక్యరాజ్యసమితి పిలుపులో భాగంగా గిరిజన తెగలు తమ హక్కులు కాపాడుకోవడానికి ఉద్యమించాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గిరిజన తెగల ఉనికి ప్రమాదంలో పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తమ హక్కులు కోల్పోతు నిరాశ్రయులుగా మారుతున్న కోట్లాది మంది గిరిజనుల హక్కులు కాపాడేందుకు ప్రభుత్వాలు పూనుకోవాలని ఐక్యరాజ్య సమితి తీర్మానించిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆదివాసి హక్కుల దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కూడా రాజ్యాంగంలో గిరిజనులకు కల్పించిన హక్కులు, చట్టాలను కాలరాసే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. దీంతో కోట్లాదిమంది గిరిజనులు నిరాశ్రయులుగా మారే ప్రమాదమున్నదన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గోపీనాయక్, రంగారెడ్డి నాయకులు శంకర్‌నాయక్, మేకల కృష్ణ, ఘన్సిరామ్‌నాయక్, సతీష్ బాజు బాయి, లలిత, జాన్సీ, బాలకిషన్, జ్యోతి, రాజు పాల్గొన్నారు.


ద్వారకానగర్‌కాలనీకి వెళ్లే దారిలో పొంగుతున్న డ్రైనేజీ

కాలనీల్లో పొంగుతున్న డ్రైనేజీలు

చంపాపేట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): చంపాపేట, హస్తినాపురం డివిజన్లలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీలు పొంగి ప్రవహిస్తున్నాయి. డ్రైనేజీల్లో చెత్త, చెదారం చేరడంతో మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. హస్తినాపురం డివిజన్‌లోని విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్‌కాలనీ నుంచి ద్వారకానగర్ కాలనీకి వెళ్లే దారిలో డ్రైనేజీ పైపులకు చెత్త, చెదారం అడ్డుపడడంతో నీరంతా పైకి వస్తుండడంతో కాలనీలు జలమయం అవుతున్నాయి. నాలాల వద్ద నీరు సాఫీగానే వెళ్తున్నాయి. వర్షాలకు కాలనీలోని రహదారులు గుంతలమయంగా మారాయి.


సీఐటీయూ స్ట్రీట్‌వెండర్స్ ఆధ్వర్యంలో క్యూబా నిధి సేకరణ చేస్తున్న నర్సిరెడ్డి

క్యూబాపై అమెరికా వైఖరి దుర్మార్గం

మన్సూరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అమెరికాకు 90మైళ్ల దూరంలోని సోషలిస్టు క్యూబా ద్వీపంపై అమెరికా విధిస్తున్న ఆంక్షలు దుర్మార్గమని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి మండిపడ్డాడు. క్యూబా ప్రజల స్ఫూర్తిని దెబ్బతీసేందుకు అమెరికా పాలకులు ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. క్యూబాకు ప్రజలంతా వస్తు, ధన రూపేనా అండగా నిలవాలంటూ క్యూబా నిధి సేకరణ కార్యక్రమాన్ని సీఐటీయూ స్ట్రీట్ వెండర్స్ ఆధ్వర్యంలో ఆదివారం నాగోల్ డివిజన్ ఆనంద్‌నగర్‌లో చేపట్టారు. ఈ సందర్భంగా కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ క్యూబాపై అమెరికా విధిస్తున్న ఆంక్షలను ఖండిస్తూ ఐక్యరాజ్యసమితి చేసిన 31 తీర్మానాలను ఆ దేశం తిరస్కరించడం హేయమన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశమంటూ క్యూబాపై ముద్రవేసి ఆంక్షలతో లొంగదీసుకోవాలన్న దుర్బుద్ధి తో అమెరికాకు ఉందన్నారు. కార్యక్రమంలో ఏరుపుల యాదయ్య, కొత్త సైదులు, కృష్ణ, సుజాత, జ్యోతి, వెంకన్న, నాగార్జున పాల్గొన్నారు.

నీట మునిగిన కాలనీలు

- చెరువులను తలపిస్తున్న లోతట్టు కాలనీలు
- సహాయక చర్యల్లో కార్పొరేటర్లు

హయత్‌నగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజ్లలోని పలు కాలనీలు నీట మునిగాయి. దాదాపు రెండు అడుగుల లోతు నీరు చేరడంతో కాలనీలకు రాకపోకలు మూసుకుపోయాయి. సాహెబ్‌నగర్ పరిసర ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో వరద నీరు రావడంతో హయత్‌నగర్‌లోని లక్ష్మీప్రినగర్‌కాలనీ మొత్తం నీట మునిగింది. జస్వాల్ పర్నిచర్ వెనుక నుంచి ఉన్న జాల కాలువను ఆక్రమించుకుని పూడ్చడంతో వర్షం నీరు మొత్తం 191 సర్వే నంబర్‌ను తాకుతూ లక్ష్మీప్రియనగర్ కాలనీని ముంచివేసింది. దీంతో ఇండ్ల చుట్టు నీరు రావడంతో ఇండ్లల్లో ఉంటున్న వారు బయటకు రాలేకపోతున్నారు. బయటి వారు ఇండ్లలోకి పోలేని పరిస్థితి నెలకొంది. రాత్రి మొత్తం బిక్కు బిక్కు మంటూ ప్రజలు ఇండ్లల్లో ఉన్నారు. రోడ్డుకు ఇరువైపులా నీరు చేరి చెరువును తలపిస్తుంది. కాలనీ సంక్షేమ సంఘం నాయకులు యాదగిరిగౌడ్ హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డికి సమాచారం ఇవ్వడంతో జీహెచ్‌ఎంసీ సిబ్బందితో అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మూసి వేసిన కల్వర్టును జేసీబీతో తీయించడంతో నీరు కిందకు వెళ్లింది. దర్గాగా కల్వర్టును మూసినా అధికారులు పట్టించుకోవడం లేదు. హయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి లక్ష్మీప్రియనగర్‌కాలనీలో పర్యటించారు. జాలు కాలువను పూడ్చం వల్లే కాలనీలు మునుగుతున్నాయని తెలిపారు.


ఇంటి చుట్టు అడుగు లోతు చేరిన వర్షం నీరు


వీరభద్రనగర్‌కాలనీలో సహాయక చర్యల్లో కార్పొరేటర్ నర్సింహారెడ్డి

నీట మునిగిన వీరభద్రనగర్‌కాలనీ..

హయత్‌నగర్ హైవే బవార్చీ ఎదురుగా ట్రంకు లైను కుంగిపోవడంతో పై కాలనీల నుంచి వచ్చిన మురుగునీరు, వర్షం నీరు ఒక్కసారిగా వీరభద్రనగర్‌కాలనీ మీదుగా ప్రవహించడంతో కాలనీ నీట మునిగింది. సమాచారం అందుకున్న మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, జీహెచ్‌ఎంసీ సిబ్బందితో అక్కడికి చేరుకుని కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. మ్యాన్‌హోల్స్ తెరిపించి వర్షం నీరును కిందకు పంపించారు. కార్యక్రమంలో డీజీఎం రాజ్‌గోపాల్, ఏఈ రాజు, హైడ్రా అధికారి వేణుతో పాటు మాన్‌సూన్ సిబ్బంది పాల్గొన్నారు.


బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, పుట్టం పురుషోత్తంరావు తదితరులు

ఘనంగా మున్నూరుకాపు సంక్షేమ సంఘం బోనాలు

ఎల్బీనగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు సంక్షేమ సంఘం దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌టీఆర్‌నగర్‌లోని ఖిలా మైసమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం పటేల్ పర్యవేక్షణలో జరిగిన బోనాల ఉత్సవాలకు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్‌పటేల్, వేములవాడ దేవాలయ కమిటీ ఈవో అన్నపూర్ణ, సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీ, గీతా ఆస్పత్రి ఎండీ డాక్టర్ సోములు, మహిళా అధ్యక్షురాలు బండి పద్మ, సంఘం దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ కమిటీ అధ్యక్షుడు అనంతుల నవీన్ పటేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ తోట రాజుపటేల్, మేకల అంజయ్య, చక్రం నాగరాజుపటేల్, ఎక్క రమేష్‌పటేల్, త్రివేది పటేల్ పాల్గొన్నారు.

ఐఎస్‌సదన్ డివిజన్ డీఎస్‌నగర్‌లో..

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ డీఎస్‌నగర్‌లో ఈదమ్మ, ముత్యాలమ్మ ఆలయం ఆధ్వర్యంలో బోనాలు నిర్వహించారు. శివసత్తులు, పోతురాజుల నృత్యాలు, డప్పు వాయిద్యాల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యాఖత్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి సామ సుందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కృష్ణ, కాశీరాం, యాదయ్య, శ్రీనివాస్, వెంకటేష్, బక్కయ్య, ఈదయ్య పాల్గొన్నారు.


గణేశ్ ఉత్సవ సమితి నూతన కార్యవర్గం ప్రతినిధులు

గణేశ్ ఉత్సవ సమితి మీర్‌పేట్ కార్యవర్గం ఎన్నిక

సరూర్‌నగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితికి అనుబంధంగా ఏర్పాటు చేసిన మీర్‌పేట్ కార్పొరేషన్ కమిటీకి ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి సంజయ్ గణాటి, కన్వీనర్ కీసరి గోవర్ధన్‌రెడ్డి హాజరై నూతన కమిటీని ప్రకటించారు. కమిటీ అధ్యక్షుడిగా చిల్లంపల్లి రాజశేఖర్, గౌరవాధ్యక్షులుగా పసునూరి భిక్షపతిచారి, కీసరి హరినాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా గడ్డం జగన్, పల్లె జంగయ్యగౌడ్, ఎ.భీమ్‌రాజ్, ఉపాధ్యక్షులుగా చప్పిడి జంగారెడ్డి, వి.గోపీనాథ్‌చారి, దిండు భూపేశ్‌గౌడ్, బి.కాశీరామ్‌యాదవ్, కీసరి కృష్ణారెడ్డి, గాజుల మధు, ఉయ్యాల నవీన్‌గౌడ్, కోశాధికారిగా యెడ్ల మల్లేశముదరాజ్, కార్యదర్శులుగా జటావత్ రవినాయక్, సిద్దాల బాలప్ప, ఎ.గోపీయాదవ్, తీగల సాయినాథ్‌రెడ్డి, జి.కృష్ణారెడ్డి, బి.నర్సింహయాదవ్, ఎస్.గేణుగోపాల్‌రెడ్డి, బొజ్జ పరమేశ్, మల్లికార్జున్, ప్రసాద్, శ్యాంసుందర్, కార్తీక్‌సాగర్, శంకర్, వెంకటేశ్‌గౌడ్, రాంగోపాల్, భాస్కర్, అనిల్‌ను ఎన్నుకున్నట్టు తెలిపారు.

కాలనీ సంక్షేమ సంఘం అనుమతి లేకుండా ఎలాంటి చర్యలకు పాల్పడినా సహించేది లేదు

వనస్థలిపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కాలనీ సంక్షేమ సంఘం అనుమతి లేకుండా ఎలాంటి చర్యలకు పాల్పడినా సహించేదిలేదని వైదేహినగర్‌కాలనీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్‌కాలనీ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం కాలనీ కమ్యూనిటీ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 35ఏళ్ల క్రితం ఏర్పడిన తమ కాలనీ చట్టప్రకారం రిజిస్ట్రేషన్ అయిందన్నారు. ఈ రిజిస్ట్రేషన్ నంబరును ఇతరులు వాడుకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తమ కాలనీపేరు ఒకరు వైదేహినగర్ నార్త్‌కాలనీ అని, మరొకరు సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అని పేర్లు పెట్టి చలామణి అవడం సహించరానిదన్నారు. అదేవిధంగా కాలనీలోని సాయిబాబ ఆలయం వద్ద నిర్మించిన సీసీ రోడ్డును జోనల్ కమిషనర్, స్థానిక కార్పొరేటర్, ఎంపీల సహకారంతో నిర్మించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు కిషన్‌రావు, శివరాం ప్రసాద్, రవీందర్‌రావు, వెంకటేశ్వర్లు, కోటేష్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో.. బైక్‌తో ఓపెన్ డ్రైనేజీలో పడిన డెలివరీ బాయ్

- తాళ్లతో బయటకు తీసిన స్థానికులు

హైదరాబాద్ సిటీ : భారీ వర్షానికి నగరంలో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ఈ క్రమంలో ఎక్కడ ఏ గుంత ఉందో..? ఎక్కడ డ్రైనేజీ ఉందో తెలుసుకోవడం వాహనదారులకు కష్టంగా మారింది. ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో జొమాటో డెలివరీ బాయ్ బైక్‌తో సహా.. ఓపెన్ డ్రైనేజీలో పడిపోయాడు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం టీకేఆర్ కమాన్ పరిధిలో చోటు చేసుకుంది. అది గమనించిన స్థానికులు తాళ్ల సహాయంతో డెలివరీ బాయ్‌ని, అతని బైక్‌ను బయటకు లాగారు. ఈ వీడియోను స్థానికులు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కాగా.. తన ఫోన్, ఇతర వస్తువులు డ్రైనేజీలో కొట్టుకుపోయినట్లు డెలివరీ బోయ్ వెల్లడించాడు. ఇంత పెద్ద ఎత్తున కుంభ వృష్టి కురిసి రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నా.. జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రమాదకర ప్రాంతాల్లో కనీసం హెచ్చరిక సూచిక బోర్డులు పెట్టకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.